క్రీడలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



బహుమతులు స్వీకరించిన క్రీడాకారులతో అధికారులు

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి అన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో విజేతలకు శుక్రవారం విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గం స్థాయిలో క్రికెట్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులు భవిష్యత్‌లో జరిగే క్రీడాపోటీల్లో మరింత ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. గన్నవరం నియోజకవర్గం స్థాయిలో రామవరప్పాడు-1 సచివాలయ పరిధిలోని క్రీడాకారులు కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. మహిళా విభాగంలో నున్న గ్రామానికి చెందిన మహిళలు కబడ్డీ పోటీల్లో, బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ద్వితీయ స్థానంలో గెలుపొందడం ఆనందంగా ఉందన్నారు. విజేతలకు షీల్డ్, మెమెంటోలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కె.సువర్ణరాజు, ఎంపీడీఓలు అద్దంకి రమ్యశ్రీ, బి.భార్గవి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం గణతంత్ర వేడుకల్లో ఉత్తమ అధికారులుగా అవార్డులు పొందిన ఎంపీడీఓ బి.భార్గవి, అసిస్టెంటు ఇంజినీరు ఎన్.శివరామకృష్ణలను ఘనంగా సన్మానించారు.

వంతెన నిర్మాణానికి స్థల పరిశీలన



అధికారులతో చర్చిస్తున్న ఎంపీపీ, సర్పంచి

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు అప్పారావుపేట వద్ద ఏలూరు కాలువపై వంతెన నిర్మాణం కోసం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులు స్థల పరిశీలన చేశారు. ఎంపీపీ అనగాని రవి నేతృత్వంలో పంచాయతీరాజ్ (పీఐయూ) డీఈ టి.నాగరాజు, ఏఈఈ రాజశేఖర్ రెడ్డితో వంతెన నిర్మాణంపై చర్చించారు. అప్పారావుపేటలోని ఓ ప్రైవేట్ వెంచర్‌లో నుంచి జగనన్న కాలనీకి ఏలూరు కాలువపై వంతెన నిర్మాణానికి అనువైన ప్రదేశంగా గుర్తించారు. వంతెనకు రెండు వైపులా వంద మీటర్లు చొప్పున అప్రోచ్ ర్యాంప్ నిర్మాణం చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. జగనన్న కాలనీలోని సుమారు 3,200 మంది లబ్ధిదారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వంతెన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీపీ సూచించారు. సీఆర్డీఏ అధికారులు, సదరు ప్లాట్ల యాజమానులతో మాట్లాడి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక, వీఆర్‌ఓ జీవన్, ఈఓ మౌనిక, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలతో జల్‌జీవన్ మిషన్ పనులు



మాట్లాడుతున్న డీఈ నారాయణరావు

పెనమలూరు: జల్‌జీవన్ మిషన్ పనులు గ్రామ కమిటీలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎల్.నారాయణరావు అన్నారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్పంచిలు, డ్వాక్రా సీసీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో ఇప్పటికే టెండర్ల ద్వారా జల్‌జీవన్ మిషన్ పనులు చేశామన్నారు. తాజాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ కమిటీలో 11 మంది సభ్యులతో ఏర్పాటు చేసి, పనులు చేయాలన్నారు. సర్పంచి, కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, డ్వాక్రా సభ్యులు కమిటీలో ఉండాలన్నారు. రూ 9.90 కోట్లతో 13 పనులు చేయాల్సి ఉందన్నారు. గంగూరు గ్రామంలో 3, వణుకూరు 2, గోసాలలో 2, పెనమలూరులో 2, చోడవరంలో 2, పెదపులిపాక గ్రామంలో 2 పనులు చొప్పున పైపులైన్, వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు చేయాల్సి ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచిలు లింగల భాస్కరరావు, గుంటూరు శ్రీనివాస చౌదరి, ఏఈ నాంచారయ్య, ఏవో లోయ శివశంకర్‌రావు, సీసీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏఎంసీ చైర్‌పర్సన్ దంపతులు



తోట దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

గన్నవరం: వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్ తోట కరుణ, వెంకయ్య దంపతులు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని రైతులకు సేవ చేసుకునే అవకాశం కల్పించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తోట దంపతులను ఎమ్మెల్యే దుశ్శాలువాతో సత్కరించారు. నియోజకవర్గంలో నూతన రైతుబజారుల ఏర్పాటు, గన్నవరం రైతుబజార్‌లో అదనపు సదుపాయలు, స్టాల్స్ నిర్మాణం గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినట్లు తోట కరుణ తెలిపారు. ఎమ్మెల్యే వంశీమోహన్ సూచనలకు అనుగుణంగా రైతుబజార్ల నిర్మాణం, రైతులకు ఉపయోగంగా డొంక రోడ్లు, అదనపు గిడ్డంగుల నిర్మాణాలను చేపట్టనున్నట్లు వివరించారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

గన్నవరం: మండలంలోని కేసరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ముస్తాబాద పీహెచ్‌సీ ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మెడికల్ కిట్లను అందజేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పంచాయతీ కార్యదర్శి మౌనిక, పలువురు సచివాలయ సిబ్బంది, ముస్తాబాద పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు నూతన శాఖ ప్రారంభం



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో పంజాబ్ నేషనల్ బ్యాంకు 71వ శాఖను ఆ బ్యాంకు జోనల్ మేనేజర్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బ్యాంకు దేశంలోనే 2వ అతి పెద్ద జాతీయ బ్యాంకు అన్నారు. ఈ బ్యాంకులో అన్ని రకాల రుణాలు, డిపాజిట్లు, ఇతర అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. చుట్టూ పక్కల గ్రామాల వారు కూడా బ్యాంక్ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు. పీఎన్‌బీ సర్కిల్ హెడ్ అభిజిత్ సిన్హా మాట్లాడుతూ తమ బ్యాంకు గృహ, వాహన, బంగారు ఆభరణాలపై అతి తక్కువ వడ్డీకే రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సుమన్ బాబు, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులకు ఎమ్మెల్యే వంశీ అభినందన



పతకాలు సాధించిన క్రీడాకారులతో ఎమ్మెల్యే వంశీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన 2వ ఇంటర్నేషనల్ ఓపెన్ ఇన్విటేషన్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్-2024లో ప్రతిభ చాటిన హనుమాన్‌జంక్షన్‌కు క్రీడాకారులను గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అభినందించారు. కరాటే, కుంగ్ ఫూ పోటీల్లో బంగారు పతకాలను సాధించిన రఘు వంశీ, ప్రభోదయ, సాల్మన్, కిరణ్ అఖిల్, శివ ప్రదీప్‌లతో పాటు కోచ్ వర్రె అంజిబాబు శుక్రవారం ఎమ్మెల్యే వంశీని కలిశారు. అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పతకాలు సాధించిన చిన్నారులను ఆయన అభినందించారు. ఎంతో కఠినమైన కరాటే, కుంగ్ ఫూ వంటి మార్షల్ ఆర్ట్స్‌లో తర్ఫీదు పొంది అంతర్జాతీయ పోటీల్లో చిన్నారులు పాల్గొనటం విశేషమన్నారు. హనుమాన్‌జంక్షన్ ప్రాంతంలో మూడు దశాబ్దాలుగా ఎంతో మంది విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్న అంజిబాబును ఎమ్మెల్యే వంశీ అభినందించారు. సాయి గీతాంజలి స్కూల్ కరస్పాండెంట్ వీడీఎస్ ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, రామన్నగూడెం మాజీ సర్పంచ్ ఢీకొల్లు అభి రమేష్ పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సమన్వయంతో పనిచేద్దాం

ఎంపీపీ ప్రసన్నకుమారి



మాట్లాడుతున్న ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి

విజయవాడరూరల్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్న కుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజానీకానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో మళ్లీ సీఎం జగన్ పరిపాలన ప్రజలకు అందించేందుకు మనమందరం కృషి చేయాలని సూచించారు. అనంతరం వ్యవసాయ అధికారి బి.రంగనాథ్ బాబు మాట్లాడుతూ మండలంలో 4వేల 300 మంది రైతులకు రైతుభరోసా కింద రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాల నుంచి ఏడాదికి రూ.5.43 కోట్ల చొప్పున రూ.20 కోట్ల 17లక్షల 20 వేల ఆర్థిక సహాయం అందజేసిందన్నారు. ఆసరా పథకం ద్వారా సమకూరిన లబ్ధిని ఏపీఎం జి.చంద్రశేఖర్ వివరించారు. మండలంలో 10 వేల 670 మంది ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి సర్వహక్కులతో అందజేస్తామని తహసీల్దార్ పి.జాహ్నవిరెడ్డి తెలిపారు. సమావేశంలో మండలంలో జరుగుతున్న వివిధ శాఖలకు చెందిన అభివృద్ధి పనుల పై ఆయా శాఖల అధికారులు వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వేమూరి సురేష్, జెడ్పీటీసీ కె.సువర్ణరాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కె.సురేష్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాటంనేని పూర్ణచంద్రరావు, కో ఆప్షన్ ఎండీ అల్తాఫ్, ఎంపీడీఓ అద్దంకి రమ్యశ్రీ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జలీల్ ఖాన్ నోరు అదుపులో పెట్టుకో..!

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి సయ్యద్ నూరుద్దీన్

రామవరప్పాడు : మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి సయ్యద్ నూరుద్దీన్ హెచ్చరించారు. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌పై జలీల్‌ఖాన్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని మైనార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నూరుద్దీన్ మాట్లాడుతూ జలీల్‌ఖాన్ నీ నీచ చరిత్ర నగర ప్రజలందరికీ తెలుసునన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం నిత్యం పరితపించే వంశీపై ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. టీడీపీ హయాంలో అభివృద్ధి పేరుతో దేవాలయాలు, కృష్ణా బ్యారేజ్ వద్ద నున్న సయ్యద్ షా ఖాద్రి దర్గాను, రామవరప్పాడులోని అబూబకర్ మసీదును కూల్చడంలో జలీల్‌ఖాన్ ప్రముఖ పాత్ర పోషించాడని గుర్తు చేశారు. ప్రశాంతంగా ఉన్న నగరంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి అలజడి సృష్టించవద్దన్నారు. రాజకీయాలకు పనికిరావని రిటైర్మెంట్ తీసుకోవాలని సలహా ఇచ్చారు. రాష్ట్రాభివృద్ధికి పాటు పడుతున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు, కార్యకర్తల జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు.

క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజేత జట్టుకు అభినందన

పెనమలూరు: ఇంటర్ కాలేజీ సాఫ్ట్‌బాల్ పోటీల్లో వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ జట్టు గెలిచింది. కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ పి.రఘు శుక్రవారం వివరాలు వెల్లడించారు. జేఎన్‌టీయూకే ఇంటర్ కాలేజీల సాఫ్ట్‌బాల్ పోటీలు ఇటీవల మైలవరం లక్కిరెడ్డి బాల్‌రెడ్డి కాలేజీలో జరిగాయి. తమ కాలేజీ విద్యార్థుల జట్టు ఈ పోటీలో 3వ స్థానంలో సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, డీన్ బావినేని పాండురంగారావు అభినందించారు.

సురక్ష వైద్య శిబిరం పరిశీలన

పెనమలూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో అన్ని వర్గాల ప్రజలకు విస్తృతంగా వైద్య సేవలు అందిస్తున్నామని తాడిగడప కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. కానూరు సచివాలయం రెండు పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందరికీ ఆరోగ్యంలో భాగంగా రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరాల్లో ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాస్, సూపర్‌వైజర్ పురుషోత్తమరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



గన్నవరం: వైఎస్సార్‌సీపీ మండలం అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్‌ను ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ శుక్రవారం పరామర్శించారు. స్థానిక గౌడపేటలోని ప్రవీణ్‌కుమార్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే ఇటీవల మృతి చెందిన నీలం సంతోషమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయురాలిగా సంతోషమ్మ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆమె అకాల మృతి పట్ల ప్రవీణ్‌కు, ఆయన తండ్రి జాకబ్ మాస్టర్‌కు, ఇతర కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, ఎంపీపీ అనగాని రవి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జలసూత్రం రామ్మోహన్‌రావు, వార్డు సభ్యులు లుక్కా ప్రసాద్, పార్టీ నాయకులు పడమట సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రబీ పంటలను నమోదు చేసుకోవాలి

గన్నవరం రూరల్: మండలంలోని రబీ పంటలు సాగు చేసే రైతులు తమ పంటలను ఈక్రాప్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్ఎల్ తేజశ్వి సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ జొన్న, మొక్కజొన్న, వరి, నువ్వుల పంటలు సాగు చేస్తున్న రైతులు పంట నమోదు చేసుకోవాలన్నారు. సొంత పొలం అయితే పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, కౌలు రైతులు అయితే కౌలు కార్డుతో నమోదు చేసుకోవాలన్నారు. పైన పేర్కొన్న ధ్రువపత్రాలను రైతు భరోసా కేంద్రంలో అందజేసి వీఏఏలను సంప్రదించాలన్నారు. ఈ నెల 15వ తేదీ వరకూ ఈ క్రాప్ నమోదు చేస్తారని తెలిపారు.

158 మంది దివ్యాంగులకు వైద్య సేవలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ఏలూరురోడ్డులోని ఆశాజ్యోతి హోంలో ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో ఏలూరు ఆశ్రమ్ ఆస్పత్రి, చిన్నవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ దంత వైద్య శాలకు చెందిన వైద్య నిపుణులు దివ్యాంగులకు వైద్య సేవలు అందించారు. శిబిరంలో మొత్తం 158 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అధునాతన సదుపాయాలు కలిగిన రెడ్‌క్రాస్ మొబైల్ డెంటల్ బస్‌లో శారీరక, మానసిక దివ్యాంగులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 24 మంది స్కేలింగ్ చేసినట్లు తెలిపారు. ఏపీ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్స్, ప్రాజెక్టు రాష్ట్ర కో ఆర్డినేటర్ బీవీఎస్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చైల్డ్ హోమ్స్‌లో చిన్నారులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆశాజ్యోతి సొసైటీ కార్యదర్శి ఎం.మాధవీలత రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

బదిలీలు.. నియామకాలు

గన్నవరం: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో పలువురు అధికారులను బదిలీ చేశారు. వారి స్థానంలో కొత్తవారిని నియమించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐలుగా పనిచేస్తున్న కె. నాగరాజు, ఎం.శ్రీనివాసు బదిలీ అయ్యారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా కె. నాగరాజును కృత్తివెన్ను పీఎస్‌కు, ఎం.శ్రీనివాసును గుడివాడ వన్‌టౌన్ పీఎస్‌కు బదిలీ చేశారు. పెనమలూరు ఎస్‌ఐ ఈ.శివప్రసాద్‌ను గన్నవరం పీఎస్‌కు బదిలీ చేశారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

పెనమలూరు: పెనమలూరు మండల ఎంపీడీఓగా ఎంవీఆర్ కుమార్‌బాబు శుక్రవారం విధుల్లో చేరారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన సునీతాశర్మ ఎన్నికల నిబంధనల మేరకు గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడు మండలం నుంచి వచ్చిన ఎంవీఆర్ కుమార్‌బాబును పెనమలూరు ఎంపీడీఓగా నియమిస్తూ జిల్లా పరిషత్ సీఈవో ఉత్తర్వులు ఇవ్వగా ఆమేరకు బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓకు మండల పరిషత్ సిబ్బంది స్వాగతం పలికారు.

ఎంపీడీవోగా రత్నకుమారి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.రత్నకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు బదిలీ కావటంతో ఆయన స్థానంలో తూర్పుగోదావరి జిల్లా నుంచి కె.రత్నకుమారి బదిలీపై ఇక్కడకు వచ్చారు. కొత్తగా విధుల్లో చేరిన ఆమెకు మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

దివ్యాంగుడికి 'మానవత' సాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం ఉమామహేశ్వరపురానికి చెందిన దివ్యాంగుడు నల్లా రామకృష్ణకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రూ.8 వేలు ఆర్థిక సాయం అందించారు. గత కొంతకాలంగా మధుమేహం వ్యాధితో బాధపడుతున్న రామకృష్ణకు ఇటీవల శస్త్రచికిత్స ద్వారా కాలు తొలగించారు. ఈ నేపథ్యంలో దివ్యాంగుడిగా మారిన రామకృష్ణకు వైద్య ఖర్చుల నిమిత్తం సాయాన్ని అందించారు. మానవత కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కళ్లేపల్లి నారాయణరావు, సీనియర్ సభ్యులు జన్యావుల సత్యనారాయణ, పొట్లూరి శేషాచలం, సుబ్బారావు పాల్గొన్నారు.

దోమల నిర్మూలన మందు పిచికారీ

కంకిపాడు: దోమల నిర్మూలన చర్యలకు ప్రజలు సహకరించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో దోమల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ శుక్రవారం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. డ్రెయినేజీల్లో వ్యర్థాలు పడేయటం వల్ల మురుగు నిలిచిపోయి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారతాయన్నారు. దోమల వ్యాప్తితో వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్‌కుమార్, రాచమళ్ల శ్యాంప్రసాద్, ఏఎన్ఎం మాధవి, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దారుగా సీతపవన్‌కుమార్

గన్నవరం మండల తహసీల్దారుగా నందిగం సీత పవన్‌కుమార్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు సీహెచ్. నరసింహారావును ఏలూరు జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో తూర్పుగోదావరి జిల్లా రాజానగరం తహసీల్దారు సీతపవన్‌కుమార్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఉత్తర్వులు జారీచేశారు.

పెనమలూరు ఎస్‌ఐగా శేషకుమార్

పెనమలూరు: పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఇద్దరు ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. పోరంకి సెక్టార్‌లో పని చేస్తున్న కె.ఉషారాణి ఉయ్యూరు రూరల్‌కు బదిలీ అవగా, పెనమలూరు సెక్టార్‌లో పని చేస్తున్న ఫిరోజ్ గుడివాడ సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. కాగా గూడూరులో ఎస్‌ఐగా పని చేస్తున్న శేషకుమార్ పెనమలూరు ఎస్‌ఐగా వచ్చారు. గతంలో శేషకుమార్ యనమలకుదురు సెక్టార్ ఎస్‌ఐగా పని చేశారు.

సీఐ, ఎస్‌ఐల నియామకం

ఉయ్యూరు: ఉయ్యూరు సీఐగా హబీబ్ బాషా నియమితులయ్యారు. బందరు రూరల్ సీఐగా పనిచేస్తున్న హబీబ్ బాషాను ఉయ్యూరు సీఐగా నియమిస్తూ ఏలూరు రేంజ్ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. టౌన్ ఎస్‌ఐగా పనిచేస్తున్న జి.వాసును బంటుమిల్లికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో కృత్తివెన్ను ఎస్‌ఐ గణేష్‌కుమార్‌ను నియమించారు. పెనమలూరు-2 ఎస్‌ఐ కె.ఉషారాణిని ఉయ్యూరు రూరల్ ఎస్‌ఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నూతనంగా నియమితులైన పోలీసు అధికారులు బాధ్యతలు చేపట్టాల్సి ఉంది.

సర్వేలో సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే వంశీకి వినతిపత్రం అందిస్తున్న బొమ్ములూరు రైతులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం కింద ప్రభుత్వం చేపట్టిన భూముల సమగ్ర సర్వేలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించాలని పలువురు రైతులు గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి విజ్ఞప్తి చేశారు. స్థానిక విజయవాడ రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బాపులపాడు మండలం బొమ్ములూరు రైతులు శుక్రవారం ఆయనను కలిశారు. భూముల సమగ్ర సర్వే పూర్తి చేసిన తర్వాత జారీ చేసిన కొత్త పట్టాదారు పాసు పుస్తకాల్లో హద్దులు, విస్తీర్ణం, భూ వర్గీకరణ అంశాల్లో పొరపాట్లు చోటు చేసుకున్నాయని, తద్వారా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వంశీ తక్షణమే రెవెన్యూ, సర్వే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బొమ్ములూరు రైతుల సమస్యలను సత్వరంగా పరిష్కారించాలని ఆదేశించారు. పార్టీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ యర్రంశెట్టి రామాంజనేయులు పాల్గొన్నారు.

దాతల సహకారం సద్వినియోగం చేసుకోవాలి

ఉంగుటూరు: దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్షణ అభియాన్ బృందం ఏపీసీ డాక్టర్ పెంచలయ్య సూచించారు. ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌ను బృందం శుక్రవారం సందర్శించింది. దాతలు, ప్రభుత్వ సంయుక్త నిధులతో నిర్మించిన తరగతి గదులు, సదుపాయాలను పరిశీలించారు. ల్యాబ్, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్‌లను చూశారు. దాత బొబ్బా వెంకటాద్రి ఇచ్చిన సదుపాయాలను హెచ్ఎం అనిత వివరించారు. అనంతరం బృందం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఏపీఎన్ఆర్ఈజీఎస్ ప్రతినిధి విజయ, సింప్లీసైన్స్ నుంచి సత్యనారాయణ పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ సుబ్బారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీటీ

ఉంగుటూరు: మండల తహసీల్దారుగా జేవీ.సుబ్బారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా టీ నరసాపురం మండలం నుంచి బదిలీపై వచ్చారు. డెప్యూటీ తహసీల్దార్ శ్రీలత నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు తహసీల్దారుగా ఉన్న డి.వనజాక్షి తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం బదిలీపై వెళ్లారు. ఈస్ట్ గోదావరి జిల్లా నుంచి ఇ.మహేశ్వరరావు ఉంగుటూరు ఎంపీడీవోగా నియమితులయ్యారు.

పెనమలూరు తహసీల్దార్‌గా ప్రసాద్

పెనమలూరు: మండల తహసీల్దార్‌గా పీఎస్‌డి.ప్రసాద్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన కట్టా వెంకట శివయ్య ఉంగుటూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తుణుకులో తహసీల్దార్‌గా పని చేస్తున్న పీఎస్‌డిప్రసాద్‌ను పెనమలూరు తహసీల్దార్‌గా నియమించారు.

ఇంటర్నెట్ కేబుల్ చోరీ

పెనమలూరు: పోరంకిలో ఇంటర్నెట్ వైర్లు చోరీ జరగటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు డొంక రోడ్డుకు చెందిన షేక్ ఇమామ్ ఏటీసీ ఇంటర్నెట్ కంపెనీకి టీమ్ లీడర్‌గా పని చేస్తున్నాడు. అతను పోరంకి, కానూరులో ఇంటర్నెట్ బాధ్యతలు చూస్తాడు. అయితే ఇంటర్నెట్ రావటం లేదని పోరంకి నుంచి ఫిర్యాదు రావటంతో మరమ్మతులు చేయటానికి పోరంకి వెళ్లాడు. అయితే కేబుల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు కట్ చేసి చోరీ చేసినట్లు గుర్తించాడు. ఈ చోరీపై ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

పెనమలూరు: కట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు బోసుబొమ్మ సెంటర్‌కు చెందిన పులిపర్తి నాగవైష్ణవి 2017 సంవత్సరం మే నెలలో మచిలీపట్నంకు చెందిన పులిపర్తి ఏసుబాబును పెద్దల సమక్షంలో వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. భార్యాభర్తలు మచిలీపట్నంలో ప్రైవేటు ఉద్యోగం చేస్తారు. వీరికి బాబు పుట్టాడు. అయితే భర్త దురలవాట్లకు బానిసగా మారి అదనపు కట్నం తీసుకురమ్మని వేధించసాగాడు. భర్తతో పాటు అత్త శోభారాణి, మామ జగదీశ్వరరావు, ఆడపడుచు మౌనికలు కూడా వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అత్తింటివారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.